సాక్షి
అనకాపల్లి
మంగళవారం : 23 : మే : 2023



జనాభా వృద్ధిలో టాప్

జనాభా వృద్ధిలో విశాఖ నగరం అగ్రస్థానంలో నిలిచింది. పన్నెండేళ్ల కాలంలో 45.76 శాతం వృద్ధి రేటు నమోదు చేసుకుంది. 8లో



క్షేత్రస్థాయిలో పరిష్కారం

కలెక్టరేట్ స్పందనకు 216 అర్జీలు వచ్చాయి. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. 8లో



బాక్సింగ్ చాంప్ విశాఖ

విశాఖ స్పోర్ట్స్: యూత్ మెన్ అంతర జిల్లాల బాక్సింగ్ పోటీల్లో టీమ్ చాంపియన్‌షిప్‌ను విశాఖ జట్టు కైవసం చేసుకుంది.

న్యూస్‌రీల్

జిల్లాలో ఇద్దరికి జీవవైవిధ్య సంరక్షణ అవార్డులు





అవార్డులు అందుకుంటున్న శ్రీధర్, చైతన్య

అనకాపల్లి టౌన్: తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఆడిటోరియంలో సోమవారం జరిగిన ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవంలో జిల్లాకు చెందిన ఇద్దరికి అవార్డులు ప్రదానం చేశారు. ఉత్తమ ఉపాధ్యాయుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, మామిడిపాలెం శారదా వేలీ డెవలప్‌మెంట్ సమితి సంస్థ తరఫున పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎస్.చైతన్య ఈ పురస్కారాలను అందుకున్నారు.

విశాఖతో శరత్‌బాబుకు వీడని బంధం



విశాఖలో సత్కారం

మద్దిలపాలెం (విశాఖ): దివంగత సినీనటుడు శరత్‌బాబుకు విశాఖతో ఎంతో అనుబంధం ఉంది. ఆయన పలుమార్లు షూటింగ్ నిమిత్తం విశాఖ వచ్చారు. స్నేహాంజలి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో 2008లో నిర్వహించిన తారలు దిగి వచ్చిన వేళ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు ఉత్తరాంధ్రతోపాటు, విశాఖతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విశాఖ సాగర తీరం వెంబడి ప్రయాణం గురించి ఎన్నో విషయాలు తెలిపారు. ఆయన మృతి పట్ల పలువురు కళాకారులు, అభిమానులు సంతాపం తెలిపారు.

పాలిసెట్‌లో మెరిశారు..

అనకాపల్లి టౌన్: ఇటీవల విడుదలైన పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఫలితాల్లో తమ విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్లు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వీఎస్ఎస్.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 8,837 మందికిగాను 7,483 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. నక్కపల్లి మండల వెదుళ్లనరవ గ్రామానికి చెందిన చొప్పా రాజేష్ రాష్ట్రంలో 180వ ర్యాంకు సాధించి, జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచాడు. పరవాడ సాయిరాంనగర్‌కాలనీకి చెందిన కె.లక్ష్మీ మాధుర్య రాష్ట్రంలో 186వ ర్యాంకు సాధించి, జిల్లాలో ద్వితీయస్థానం స్థానంలో నిలిచింది. పాయకరావుపేటకు చెందిన పి.వెంకట నందిని రాష్ట్రంలో 187వ ర్యాంకు సాధించి, జిల్లాలో తృతీయస్థానంలో నిలిచింది.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ గోపాలకృష్ణారావు దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ ఎస్.కనకరాజు అందజేశారు.

జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కార్యాలయం ప్రారంభం

బీచ్‌రోడ్డు (విశాఖ): సిరిపురంలోని వీఎంఆర్డీఏ సముదాయంలో సోమవారం జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కార్యాలయాన్ని రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ వి.సుందర్ ప్రారంభించారు. అనంతరం జేటీసీ సుందర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పరిధిలోని రవాణాశాఖ దైనందిన కార్యకలాపాల సమగ్ర పర్యవేక్షణకు జోనల్ స్థాయిలో ఈ కార్యాలయం ఏర్పాటైందని చెప్పారు. రోడ్డు భద్రత, ఆదాయం పెంపు ఎలా, డ్రైవింగ్ స్కూళ్లు, డ్రైవింగ్ ట్రాక్‌ల పనితీరు, ఫిట్‌నెస్ ఆటోమేషన్ వంటి వాటిపై తరచూ పర్యవేక్షిస్తామన్నారు. ఈ కార్యాలయంలో ఒక పరిపాలన అధికారి, ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు, ఒక అటెండరు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీసీ రాజారత్నం, వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పానీపూరి బండి నుంచి స్టార్ హోటల్ వరకు

కాదేదీ కల్తీకి అనర్హం

పైపై హంగులు చూసి, మోత మోగే బిల్లు చూసి ఖరీదైన రెస్టారెంట్లు ఆహార పదార్థాలను రుచిగా శుచిగా అందిస్తాయని భావిస్తాం. ఇంట్లో కన్నా టేస్టీగా ఉన్నాయని లొట్టలేసుకొని తింటాం. కానీ పై మెరుగులు చూసి మోసపోవద్దని ఆహార భద్రత శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. వారి దాడుల్లో బయల్పడిన కేసులే ఇందుకు తార్కాణం. వారు వెల్లడించిన విషయాలను పరిశీలిస్తే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. రోడ్డు పక్కన పానీపూరి బండి నుంచి స్టార్ హోటల్స్ వరకు కల్తీ ఆహారం అమ్మకాలు సాగిస్తున్న వైనం చూస్తే భయమేస్తుంది.



- ప్రశ్నార్థకంగా ఆహార భద్రత
- విచ్చలవిడిగా కల్తీ ఆహారం
- ఏడాదిలో 30 కేసులు నమోదు

నర్సీపట్నం: ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి అని పాడుకుంటూ హోటల్ ఫుడ్ లాగించేస్తున్నారా.. అయితే కాస్త ఆగండి. ఆరోగ్యకరమో కాదో ఆలోచించండి. ఆహార పదార్థాలు రుచిగా ఉండేందుకు మోనోసోడియం గ్లూటామేట్ వాడినట్లు రుజువు కావడంతో ఆహార భద్రత తనిఖీ అధికారులు అనకాపల్లిలో రెండు హోటళ్లపై ఇటీవల కేసులు నమోదు చేశారు. మోనోసోడియం గ్లూటామేట్ ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. ఆకర్షణీయంగా ఉండేందుకు రసాయనాలతో కూడిన రంగులు కలిపారని నర్సీపట్నంలోని ఒక ప్రముఖ రెస్టారెంట్‌పై కేసు బుక్ అయింది. ఆహార పదార్థాలను నిల్వ ఉంచడం కోసం కూడా యథేచ్ఛగా కెమికల్స్ వాడుతున్నారు. పెద్ద పెద్ద హోటళ్లలో కూడా రెండు మూడు రోజులు నిల్వ ఉంచిన చికెన్ కర్రీలు, బిర్యానీలు వడ్డిస్తున్నారు. ఇలాంటి కేసులను ఆహార భద్రత శాఖ సీరియస్‌గా తీసుకుంటుంది. నేరం రుజువైతే నిర్వాహకులకు ఏడు సంవత్సరాల వరకు శిక్ష పడే అవకాశం ఉంది.



కొరడా ఝుళిపించాలి

ఆహార భద్రత శాఖ (ఫుడ్ సేఫ్టీ అథారిటీ అండ్ స్టాండర్డ్స్)కు హోటల్స్, రెస్టారెంట్లను తనిఖీ చేసే అధికారం ఉంది. జిల్లావ్యాప్తంగా ఆహార భద్రత శాఖ పరిధిలో వేలల్లో దుకాణాలు ఉన్నాయి. పాన్ షాపు నుంచి స్టార్ హోటల్ వరకు దీని పరిధిలోకి వస్తాయి. మనుషుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లకుండా వ్యాపారులు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ అమ్మకాలు సాగించాల్సి ఉంది. గతంలో అనకాపల్లి, నర్సీపట్నం ప్రాంతాల్లోని రెస్టారెంట్లు, హోటల్స్‌లో విజిలెన్స్ అధికారులు జరిపిన దాడుల్లో రోజుల తరబడి నిల్వ చేసిన మాంసపు పదార్థాలు వెలుగు చూశాయి. తర్వాత ఆ స్థాయిలో తనిఖీలు జరగకపోవడంతో వ్యాపారులు యథావిధిగా విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఏదైనా హోటల్‌కు వెళ్లినప్పుడు అక్కడ పరిశుభ్రతతో పాటు ఇతర పరిస్థితులు నిబంధనలకు అనుగుణంగా లేనప్పుడు వారికి నోటీసులిచ్చి, సరిచేసేందుకు 15 రోజుల గడువు ఇవ్వాల్సి ఉంటుంది. ఇక ఆహారం విషయానికొస్తే నిల్వ సరకులు, నాసిరకం పదార్థాలు అమ్మకాలు చేస్తే, వాటి శాంపిల్స్ సేకరించి పరీక్షలకు సంబంధిత శాఖకు పంపాల్సి ఉంటుంది. దీనిలో ఏమైనా అవశేషాలు ఉన్నట్టు రిపోర్టు వస్తే వారిపై కేసు నమోదు చేసే అవకాశం ఉంటుంది. ఎక్కడపడితే అక్కడ బిర్యానీ పాయింట్లు, చిట్‌చాట్ సెంటర్లు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్యం చెడిపోవడానికి ఈ ఫుడ్ సెంటర్లే ప్రధాన కారణమని వైద్యులు సైతం చెబుతున్నారు. అధికారులు, వినియోగదారులు అప్రమత్తం కాకపోతే ఆరోగ్యానికి చేటు కలిగే ప్రమాదం ఉంది.

ఆరోగ్యంపై ప్రభావం

నేటి ఉరుకులు పరుగుల జీవితంలో బయట దొరికే ఆహార పదార్థాలపై ఆధారపడడం సర్వసాధారణమైంది. ముఖ్యంగా వారాంతంలో కుటుంబంతో, స్నేహితులతో హోటల్‌కు వెళ్లడం పరిపాటిగా మారింది. సెమీ అర్బన్ ప్రాంతాల్లో కూడా ఈ ఒరవడి ఎక్కువైంది. ఇలాంటి పరిస్థితిలో హోటళ్లు, రెస్టారెంట్లు, చాట్ భాండార్‌లు పరిశుభ్రత పాటించకపోతే ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. విజిలెన్స్ అధికారులు గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు జిల్లా పరిధిలో 144 శాంపిల్స్ సేకరించారు. వీటిని పరీక్షకు పంపి, అవకతవకలు రుజువు కావడంతో 30 కేసులు నమోదు చేశారు. మరిన్ని తనిఖీలు చేసి ఆహార కల్తీపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది. ఫ్లేవర్ కోసం రంగులు, రసాయనాలు కలపడం, చెల్లుబాటు కాకపోతే రెండు, మూడు రోజుల తర్వాత కూడా వడ్డించడం సర్వసాధారణమైపోయింది. దీనివల్ల మనుషుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని తెలిసినా లాభాపేక్షతో వ్యాపారులు అమ్మకాలు సాగిస్తున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ఆహార భద్రత సిబ్బంది విస్తృతంగా దాడులు చేయాల్సి ఉన్నప్పటికీ స్పందన అంతంత మాత్రంగానే ఉంటోందని విమర్శలు వెల్లువెత్తున్నాయి.

విస్తృతంగా దాడులు



హోటల్స్, రెస్టారెంట్లపై ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తున్నాం. నెలకు డివిజన్ పరిధిలో శాంపిల్స్ సేకరిస్తున్నాం. వాటిని ల్యాబ్‌కు పంపించి వచ్చిన రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటున్నాం. నిల్వ ఆహారపదార్థాలు విక్రయిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఆహార పదార్థాల్లో రసాయనాలు వాడితే చర్యలు తీవ్రంగా ఉంటాయి. ఆహార భద్రత ప్రమాణాలు పాటించని నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెడతాం.

–బి.రవికుమార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, నర్సీపట్నం డివిజన్

జగనన్న విదేశీ విద్యా దీవెనకు

దరఖాస్తుల స్వీకరణ

తుమ్మపాల: జగనన్న విదేశీ విద్యాదీవెన పథకంలో పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సులు చదివేందుకు అర్హులైన విద్యార్థులు జూన్ 10వ తేదీలోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి అజయబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో అర్హత కలిగిన విద్యార్థులు అంతర్జాతీయంగా 50 ఉత్తమ యూనివర్సిటీలు, కాలేజీలలో నూతన జాబితా క్యూఎస్ , టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్-2023 ప్రకారం 379 మంది విద్యార్థులకు అర్హత కలిగి ఉందన్నారు. విద్యార్థులు క్వాలిఫయింగ్ పరీక్షలలో 60 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఎంబీబీఎస్ దరఖాస్తు చేసుకొనుటకు విద్యార్థులు నీట్‌లో అర్హత కలిగి ఉండాలన్నారు. ఈ పథకంలో అర్హత కలిగి ఎంపికైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు 100 శాతం ట్యూషన్ ఫీజు/రూ.125 లక్షలు ఏది తక్కువైతే అది ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఇతర విద్యార్థులకు 100 శాతం ట్యూషన్ ఫీజు, రూ.100 లక్షలు ఏది తక్కువైతే అది చెల్లిస్తామన్నారు. విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.8లక్షల లోపు ఉండాలన్నారు. విద్యార్థి వయస్సు నోటిఫికేషన్ నాటికి 35 సంవత్సరాలు లోపు ఉండాలన్నారు.

నేడు మినీ జాబ్‌మేళా

అనకాపల్లి టౌన్: రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం 4 కంపెనీలతో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పది, ఇంటర్, బీటెక్, పీజీ విద్యార్హత గల నిరుద్యోగులు జాబ్‌మేళాకు అర్హులని ఆయన తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ మేళా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7013342667 సంప్రదించాలని ఆయన కోరారు.

సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లు

- సమపాళ్లలో సాగుతున్న సీఎం వైఎస్ జగన్ పాలన
- సీఎస్సార్, ఎంపీ నిధులతో జిల్లాలో పలు అభివృద్ధి పనులు
- 52 అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.40 వేల వంతున కేటాయింపు
- ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి

సాక్షి, అనకాపల్లి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో నాలుగేళ్ల పాలనలో ఇటు అభివృద్ధి.. అటు సంక్షేమం సమపాళ్లలో పరుగులు పెడుతున్నాయని ఎంపీ డాక్టర్ బీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. సోమవారం అనకాపల్లిలోని తన కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎస్సార్, ఎంపీ ల్యాడ్స్ నుంచి జిల్లాలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. కొంకోట మండలం వెదురుపర్తి గ్రామం హైస్కూల్ అభివృద్ధికి రామ్‌కో సిమెంట్ సంస్థ సహకారంతో సీఎస్సార్ నిధుల నుంచి రూ.35 లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టామన్నారు. 4 తరగతి క్లాస్ రూంతో పాటుగా మరుగుదొడ్లు, ప్రహరీగోడను నిర్మించినట్లు ఆమె చెప్పారు. ఈ నెల 24న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సిమెంట్ సంస్థ ప్రతినిధులతో కలిసి తాను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఏషియన్ పెయింట్స్ వారి సహకారంతో రూ.12 లక్షలతో బయ్యవరం ఇరిగేషన్ కాలువ గేట్ల నిర్మాణాన్ని చేపట్టామన్నారు. ఈ నిర్మాణం పూర్తి కావడంతో కొంకోట- వెదురుపర్తి గ్రామాల్లో 500 ఎకరాల చెరకు పంటకు సాగునీరు అందనుందన్నారు. అదేవిధంగా ఐవోసీఎల్ కంపెనీ సహకారంతో కొంకోట బాలికోన్నత హైస్కూల్లో రూ.కోటి 20 లక్షలతో ఆరు తరగతి గదులు, విద్యార్థులకు డైనింగ్ హాలు, సైకిల్ స్టాండ్ నిర్మించినట్లు తెలిపారు. సామాజిక బాధ్యతతో కార్పొరేట్ పరిశ్రమల యాజమాన్యాలు సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

అంగన్‌వాడీ కేంద్రాలకు ఎంపీ నిధులు

జిల్లాలో 52 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి, ఆధునికీకరణ, మౌలిక వసతులకు ఎంపీ నిధులు మంజూరు చేసినట్లు డాక్టర్ సత్యవతి తెలిపారు. తొలి విడత ఒక్కొక్క అంగన్‌వాడీకి రూ.40 వేలు చొప్పున ఎంపీ నిధుల నుంచి మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో ఈనెల 25న ఇంక్యుబేషన్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు ఆమె చెప్పారు. ఇంక్యుబేషన్ సెంటర్ నిర్మాణ పనులకు రూ.3.5 కోట్లు మంజూరు చేశామన్నారు. మన పూర్వీకులు చిరుధాన్యాలు తీసుకుంటూ ఆరోగ్యంగా జీవించేవారని, ప్రస్తుతం కొండ ప్రాంతాల్లో చిరుధాన్యాలు ఎక్కువగా పండిస్తూ.. మైదాన ప్రాంతాలకు తీసుకువస్తున్నారని చెప్పారు. వనసకు అంతర్జాతీయస్థాయిలో ఎంతో గుర్తింపు ఉందని, పోషక విలువలు ఉంటాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవాన్ని ఏడాది పాటు నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుతం తింటున్న ఆహారపదార్థాల వలన వివిధ రకాల వ్యాధులకు ప్రజలు గురవుతున్నారని, చిరుధాన్యాల వలన ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు.

క్రీడలతో భవిత

మేయర్ హరివెంకట కుమారి జీవీఎంసీ సమ్మర్ క్యాంపులు ప్రారంభం



బెలూన్లు ఎగురవేసి సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

సీతంపేట (విశాఖ): సమ్మర్ కోచింగ్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ హరి వెంకట కుమారి అన్నారు. క్రీడల్లో రాణిస్తే భవిత బాగుంటుందన్నారు. స్వర్ణభారతి స్టేడియంలో సోమవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, నగర పోలీస్ కమిషనర్ సీ.ఎం.త్రివిక్రమ్ వర్మ, డిప్యూటీ మేయర్, ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్లతో కలిసి ఆమె క్రీడా శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరాలను 6 నుంచి 15 ఏళ్ల గల పిల్లలకు 15రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 5 వరకు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్టు ఏర్పాటు చేశామన్నారు. జీవీఎంసీ అన్ని జోన్లలో, అన్ని వార్డుల్లో మొత్తం 333 శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేశామని, ఎనిమిది వేల మంది పిల్లలు ఈ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. 33 రకాల క్రీడల్లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. క్రీడాకారులకు అల్పాహారంగా పాలు, గుడ్లు అందజేస్తారని, టీషర్టు కూడా ఇస్తారన్నారు. చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచేందుకు వేసవి శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలన్నారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ పిల్లల్లో శారీరక ఎదుగుదల, మానసిక బలం పెంపొందించేందుకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మూడేళ్ల తర్వాత వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. దీనికి కారణమైన మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మలను అభినందించారు. క్రీడల్లో ఆసక్తి చూపే పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనే చిన్నారులకు విశాఖ డెయిరీ ఫ్లేవర్డ్ మిల్క్ స్పాన్సర్ చెయ్యడానికి ముందుకు వచ్చిందని, ఈ సందర్భంగా డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కు అభినందనలు తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లకు వెల్ఫేర్ సెక్రటరీలు ఇంచార్జిలుగా ఉంటారని, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ సీ.ఎం.త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులు ఏదో ఒక క్రీడను ఎంచుకుని రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు.



విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా బాలబాలికలు చేసిన మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు, టైక్వాండో, కరాటే, జూడో ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు, డీసీఆర్ ఎం.వి.డి.ఫణిరామ్, కార్యదర్శి వల్లి నల్లనయ్య, డీఈవో శ్రీనివాస్, జోనల్ కమిషనర్లు, స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కల్యాణం..కమనీయం

పులిమెట్ట పులకించిపోయింది.. గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది...కల్యాణ వెంకన్నను కనులారా వీక్షించి భక్తులు అలౌకికానందంతో పరవశించిపోయారు. ఐ.పోలవరంలో టీటీడీ నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. అంతకు ముందు మహాసంప్రోక్షణ, ఇతర వైదిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

- కన్నులపండువగా శ్రీవారి పెళ్లి వేడుక
- వేంకటేశ్వరస్వామి నామస్మరణతో మార్మోగిన పులిమెట్ట
- భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు



పూజ కార్యక్రమంలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి దంపతులు



ఉత్సవ విగ్రహాలకు పూజలు



శ్రీనివాస కళ్యాణం నిర్వహిస్తున్న రుత్వికులు

రంపచోడవరం: మండల కేంద్రం రంపచోడవరం సమీపంలోని ఐ. పోలవరం జంక్షన్ వద్ద పులిమెట్టపై నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాసుని కల్యాణం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి కల్యాణాన్ని కనులారా తిలకించిన భక్తులు పరవశించిపోయారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన రుత్వికులు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుని కల్యాణాన్ని అశేష భక్త జన సందోహం మధ్య వైభవోపేతంగా నిర్వహించారు. వేంకటేశ్వరుడు కొలువైన పులిమెట్ట ఆలయం భక్త జన సందోహంతో కిక్కిరిసిపోయింది. గోవిందా నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. సోమవారం ఉదయం వేంకటేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు. రోజంతా అనేక వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీనివాసుని కల్యాం, తిరువీధి ఉత్సవం నిర్వహించారు.

ఘనంగా మహాసంప్రోక్షణ

పులిమెట్టపై టీటీడీ నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయ మహాసంప్రోక్షణ సోమవారం ఆగమోక్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి 8.15 గంటల వరకు సుప్రభాతం సేవ, యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 8.15 గంటల నుంచి 8.45 గంటల వరకు యాగశాలలో మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఉదయం 8.45 గంటల నుంచి 9 గంటల వరకు యాత్ర దానము, కుంభ ప్రదక్షిణ చేశారు. ఉదయం 9 నుంచి 9.30 గంటల మధ్య మిథున లగ్నంలో మహాసంప్రోక్షణ, కళావాహన జరిపారు. అనంతరం అక్షతారోపణ, బ్రహ్మఘోష, ఆచార్య బహుమానం అందించారు.

భక్తులకు దర్శనం

మహాసంప్రోక్షణ అనంతరం ఉదయం 10 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. రంపచోడవరం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులందరికీ, తాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీవారి సేవకుల విశేష సేవలు

వేంకటేశ్వరస్వామి ఆలయ మహాసంప్రోక్షణ సందర్భంగా ఆరు రోజులపాటు నిర్వహించిన కార్యక్రమాల్లో శ్రీవారి సేవకులు విశేష సేవలు అందించారు. భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాల పంపిణీ, ఆలయానికి అవసరమైన పూల దండలు కట్టడం తదితర సేవలు అందించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, తూర్పుగోదావరి జిల్లాల నుంచి వచ్చిన దాదాపు 500 మంది శ్రీవారి సేవకులు భక్తులకు సేవలు అందించారు.

ఆకట్టుకున్న భజనలు, కోలాటాలు

ఆలయం వద్ద గల వేదికపై టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. గిరిజన ప్రాంతాల నుంచి వచ్చిన బృందాలు వివిధ కళారూపాలను ప్రదర్శించాయి. కోలాటాలు, భజనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీ మార్గాని భరత్, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జేఈవో వీరబ్రహ్మం, సీఈ నాగేశ్వరరావు, పీఆర్వో డాక్టర్ రవి, ఎస్ఈ టి.వి.సత్యనారాయణ, వీజీవో శ్రీ మనోహర్, డిప్యూటీ ఈవోలు గుణభూషణ్ రెడ్డి, వెంకటయ్య, శివప్రసాద్, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఈఈ సుధాకర్, రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో జనరల్ శ్రీనివాసరావు, ఎంపీపీ బందం శ్రీదేవి, సర్పంచ్ కుంజము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీలు పండా వెంకటలక్ష్మి, బేబీ రాణి, వైస్ ఎంపీపీలు కె.బాలకృష్ణ, పండా కుమారి, అన్నవరం డైరెక్టర్ కారుకోడి పూజ,ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, తహసీల్దార్ పి.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఎం.వి.ఆర్. కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లీకుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు


తల్లీకూతురు సుజాత, దీక్షిత(ఫైల్)

మునగపాక: మండలంలోని చూచుకొండ గ్రామానికి చెందిన వివాహిత సుజాత, ఆమె కూతురు దీక్షిత కనిపించడం లేదంటూ మునగపాక పోలీసులకు ఫిర్యాదు అందింది. గ్రామానికి చెందిన మళ్ల అప్పారావు సమీపంలోని ఎస్ఈజెడ్‌లో పనిచేస్తుంటాడు. అతని భార్య సుజాత అచ్యుతాపురం మండలం హరిపాలెంలో తాపీమేస్త్రీ వద్ద కూలీగా పని చేస్తోంది. ఎప్పటిలాగానే ఈ నెల 19న అప్పారావు తన బైక్‌పై భార్య, కుమార్తెను తీసుకువచ్చి హరిపాలెంలో దింపాడు. తిరుగు ప్రయాణంలో తీసుకెళ్లేందుకు రాగా, వారు కనిపించకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికాడు. ఇంతవరకూ ఆచూకీ లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఆచూకీ తెలిసిన వారు 8464825574, 9391564128, 9703330403 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కారం

- స్పందన కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- 216 అర్జీల స్వీకరణ


అర్జీదారునితో మాట్లాడుతున్న, కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి


అర్జీదారు సమస్య వింటున్న, ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్: స్పందన ఫిర్యాదులపై సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయనతో పాటు జేసీ జాహ్నవి, డీఆర్వో పి.వెంకటరమణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్పందన వినతులపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ వారం మొత్తం 216 అర్జీలు నమోదయ్యాయి. అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్‌లలో ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, డ్రైవింగ్, వీఆర్వో పోస్టులు భర్తీ చేయాలంటూ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రవికుమార్ వినతిపత్రం అందజేశారు.

నిర్ణీత సమయంలో సమస్యపై నివేదికివ్వాలి: ఎస్పీ

చట్టపరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. తన కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ప్రజల నుంచి 33 అర్జీలు ఆయన స్వీకరించారు. అర్జీదారులు పలు సమస్యలను విన్నవించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేస్తానని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీల సమస్యలపై నిర్ణీత సమయంలో నివేదిక అందించాలని దిగువస్థాయి పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో మాజీ సర్పంచ్ చేరిక


పార్టీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితురాలై మండలంలోని జి.కొత్తపల్లి మాజీ సర్పంచ్ కంటిపాము అచ్చియమ్మ వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం ఇక్కడ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో టీడీపీ కార్యకర్త బండి మహేష్‌తో కలిసి ఆమె చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతోపాటు డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు నాయకత్వం చూసి పార్టీలో చేరామన్నారు. ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు యర్రా అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అనకాపల్లిటౌన్: మండలంలో గొలగాం పంచాయతీ గుమస్తా కాలనీకి చెందిన యలమంచిలి దిలీప్(19) పొలాల్లో సోమవారం ఉరి వేసుకొని మృతి చెందాడు. గ్రామీణ ఎస్ఐ నరసింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. చుట్టు పక్కల రైతుల సమాచారం ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

మోతుగూడెం ఎస్ఐ లొంగుబాటు

- గంజాయి కేసులో అరెస్టు
- 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

చింతూరు: నెల్లూరులో నమోదైన గంజాయి కేసుకు సంబంధించి పరారీలో వున్న మోతుగూడెం ఎస్ఐ సత్తిబాబు చింతూరు సీఐ అప్పలనాయుడు ఎదుట లొంగిపోయినట్టు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం అతనిని రంపచోడవరం ఓఎస్డీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో విచారించిన అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించినట్టు తెలిపారు. గత నెల 21న మోతుగూడెం ఎస్ఐ సత్తిబాబు, కానిస్టేబుల్ శివప్రసాద్‌తో పాటు మణి, మరి కొంతమందిపై నెల్లూరులో నమోదైన గంజాయి కేసులో ప్రమేయం వున్నందున వారిపై మోతుగూడెం పోలీసుస్టేషన్లో కేసు నమోదు చేశామని ఎస్పీ వివరించారు. ఎస్ఐ సత్తిబాబు, కానిస్టేబుల్ శివప్రసాద్ గంజాయి స్మగ్లర్ల నుంచి డబ్బులు వసూలు చేయడంతో పాటు గంజాయి రవాణాకు సహకరించారని ఆయన పేర్కొన్నారు. కేసు విచారణలో శివప్రసాద్‌తో పాటు మణి అనే వ్యక్తిని ఇప్పటికే అరెస్టు చేయగా ఎస్ఐ సత్తిబాబు అప్పటి నుంచి పరారీలో వున్నారని ఆయన తెలిపారు. సోమవారం ఆయన చింతూరులో లొంగిపోగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని, ఈ కేసులో ఇంకా విచారణ కొనసాగుతుందని ఎస్పీ పేర్కొన్నారు.

4 ఏళ్లలో అభివృద్ధి చేసి చూపించాం

బహిరంగ చర్చపై టీడీపీ నేతలకు ఎమ్మెల్యే బాబూరావు సవాల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: తండ్రీకొడుకులు ఏముఖం పెట్టుకుని యాత్రలు చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని, రాష్ట్రంలో నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, దానికి చంద్రబాబుగాని టీడీపీ నాయకులు గాని సిద్ధంగా ఉన్నారా అని పాయకరావుపేట ఎమ్మెల్యే, అసెంబ్లీ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ గొల్ల బాబూరావు సవాల్ విసిరారు. సోమవారం ఆయన పాయకరావుపేటలో మాట్లాడుతూ నలభై ఏళ్లలో జరగని అభివృద్ధి నాలుగేళ్లలో చేసి చూపించామని, ఏయే సంక్షేమ పథకాలు అమలు చేశాం, ఎంతమందికి ప్రయోజనం కలిగిందనే వివరాలను తాము ప్రజావేదిక సమక్షంలో చెప్పడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అభివృద్ధి జరగలేదని చెప్పే ధైర్యం టీడీపీ సహా ప్రతిపక్ష నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ పథకాల రూపంలో రూ.2.50 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. గతంలో సంక్షేమ పథకాల నిధులన్నీ పచ్చ చొక్కాల జేబుల్లోకి వెళ్లేవన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. నారా లోకేష్ చేసేది యువగళం యాత్ర కాదని గంగాళం యాత్ర అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, లోకేష్ యాత్రలకు స్పందన రాకపోవడంతో గ్రాఫిక్స్‌లో జనాలు సెట్ చేసి ఎల్లోమీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో 30 లక్షల మందికి సెంటున్నర చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి, వారందరికి ఇళ్లు మంజూరు చేసిన ఘనత జగనన్న సర్కారుదేనన్నారు. అమరావతిలో పేదలు ఉండకూడదనే ఉద్దేశంతోనే సెంటు స్థలంలో శవాన్ని పూడ్చటానికి సరిపోదని చంద్రబాబు చౌకబారు వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి, కోటవురట్లలో ఆస్పత్రులను 50 పడకల స్థాయికి పెంచడం, డిగ్రీ కళాశాల, నాడు – నేడు కింద పాఠశాలల అభివృద్ధి, పీహెచ్‌సీలకు కొత్త భవనాల నిర్మాణం, పక్కారోడ్లు, సచివాలయాలు, ఆర్బీకేలు, వంటి వంటి ద్వారా దాదాపు రూ.900 కోట్లతో అభివృద్ధి పనులు చేసి చూపించామన్నారు. గజం స్థలం కూడా ఇవ్వలేని టీడీపీకి విమర్శించే అర్హత లేదన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ ఇసరపు పార్వతీతారావు, జిల్లా పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ నాయకులు గెడ్డమూరి శ్రీను, యజ్జల అన్నవరం పాల్గొన్నారు.

జనాభా వృద్ధి రేటులో విశాఖ టాప్

- 12 ఏళ్లలో జిల్లాలో 45 శాతం జనాభా వృద్ధి నమోదు
- 2023 చివరి నాటికి 28.56 లక్షలకు చేరుకునే అవకాశం?
- జీవీఎంసీ పరిధిలో 22.4 శాతం పెరుగుదల

సాక్షి, విశాఖపట్నం: సువిశాల సాగరతీరం.. ఎటుచూసినా కనువిందు చేసే సోయగాల్ని సొంతం చేసుకున్న అందమైన విశాఖ నగరంలో జనాభా క్రమంగా పెరుగుతోంది. స్థిరపడిన వలస జీవులతోపాటు విస్తరిస్తున్న నగరంలో జనాభా వృద్ధి రేటు కూడా అదే స్థాయిలో ఉంది. జిల్లాల పునర్విభజన తర్వాత కూడా జనాభా పెరుగుదలలో విశాఖపట్నం అగ్రస్థానంలో ఉండటం విశేషం. 2011 నుంచి 2023 డిసెంబర్ నాటికి జనాభా వృద్ధిలో విశాఖ జిల్లా 45.76 శాతంతో రాష్ట్రంలో అగ్రస్థానంలోను.. 33.41 శాతం వృద్ధితో అనకాపల్లి జిల్లా 14వ స్థానంలో ఉంటుందని కేంద్ర గణాంకాల శాఖ అంచనా. జనాభా పెరుగుదలలో అల్లూరి సీతారామరాజు జిల్లా 32.33 శాతంతో 18వ స్థానంలో ఉండనుంది. అత్యధిక జనాభా పెరుగుదల ఉన్న కార్పొరేషన్‌గా జీవీఎంసీ మొదటి స్థానంలో నిలవనుంది. ఈ ఏడాది చివరి నాటికి జీవీఎంసీ పరిధిలో 26,96,364 మంది జనాభా నమోదు కానుందని గణాంకాలు చెబుతున్నాయి. 2011 నుంచి 2023 ఏడాది చివరి నాటికి జనాభా వృద్ధి ఎలా ఉంటుందనే వివరాల్ని ఓసారి పరిశీలిస్తే..

జిల్లా	విస్తీర్ణం (కి.మీ)	2011 జనాభా	2023 అంచనా జనాభా	జనసాంద్రత (చ.కిమీ)	వృద్ధి రేటు
విశాఖపట్నం	1,048	19,59,544	28,56,308	2725.48	45.76
అనకాపల్లి	4,292	17,26,998	23,04,020	536.81	33.41
అల్లూరి సీతారామరాజు	12,251	9,53,960	12,62,388	103.04	32.33
జీవీఎంసీ	681.96	20,91,811	26,96,364	3,953.81	22.40

కుమార్తెను చూడడానికి వెళుతూ..


మృతుడు సోమనాద్రి అప్పారావు

మాడుగుల రూరల్: కుమార్తెను చూడడానికి ద్విచక్ర వాహనం మీద బయలుదేరిన వ్యక్తి హఠాత్తుగా ప్రాణాలు విడిచాడు. వడదెబ్బ కారణంగా చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. మండలంలో చింతలూరు గ్రామానికి చెందిన సోమనాద్రి అప్పారావు(60) సోమవారం స్కూటీ మీద కుమారుడితో కలిసి విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు. ఆయన ఘాట్‌రోడ్డు జంక్షన్ మీదుగా, ఎం.కోటపాడు గ్రామం దాటేసరికి వడదెబ్బ తగలడంతో రహదారి మీద పడిపోయి చనిపోయారు. అప్పారావు కుమారుడు ఆ సమయంలో పక్కనే వున్నారు. సోమవారం ఎండ తీవ్రత ఎక్కువగా వుంది. వడదెబ్బతో మృతి చెందినట్టు భావిస్తున్నారు. మృతదేహాన్ని స్వగ్రామం చింతలూరుకు తీసుకెళ్లారు.

చెన్నై నుంచి ఆర్డర్.. గుట్టుగా గంజాయి తరలింపు

- కావలిలో ఆరుగురి అరెస్ట్
- 50 కేజీల గంజాయి స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): చెన్నైకి చెందిన కొందరు గంజాయి కావాలని ఆర్డర్ ఇచ్చారు. ఆరుగురు వ్యక్తులు సరకును గుట్టుగా రవాణా చేసేందుకు యత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి నిందితుల వివరాలను సోమవారం వెల్లడించారు. అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కుసర్లపూడి గ్రామానికి చెందిన జి.అనంత శివప్రసాద్, శరభవరం గ్రామానికి చెందిన కె.శ్రీను, రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన వి.రాజు, విశాఖపట్నం మద్దిలపాలేనికి చెందిన జి.రాజు, సీతమ్మధారకు చెందిన కె.ప్రేమ్‌కుమార్, మధురవాడ స్వతంత్రనగర్‌కు చెందిన ఎ.రాజేష్ కారు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఇంకా వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారు ఒడిశా బోర్డర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో గంజాయి సేకరించి చెన్నైకి చెందిన కార్తీక్, సురేష్‌కు కేజీ రూ.5 వేలు చొప్పున విక్రయించి సొమ్ము చేసుకోసాగారు. ఈ నేపథ్యంలో ఈ నెల 21న నిందితులు రెండు కార్లలో 50 కేజీల గంజాయిని తీసుకుని చెన్నైకు బయలుదేరారు.

పక్కా సమాచారంతో దాడులు

గంజాయి అక్రమ రవాణాపై కావలి డీఎస్పీ వెంకటరమణ, రూరల్ సీఐ ఎం.రాజేష్‌కు పక్కా సమాచారం అందింది. దీంతో 21న కావలి హైవేపై వాహన తనిఖీలు చేపట్టారు. ఓ హోటల్ సమీపంలో రెండు కార్లు ఆగాయి. అందులోని ఆరుగురు వ్యక్తులు భోజనం చేసేందుకు వెళ్తుండగా పోలీసులు గమనించారు. వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు.

కార్లను తనిఖీ చేయగా అందులో 50 కేజీల గంజాయిని గుర్తించారు. నిందితులను స్టేషన్‌కు తరలించి విచారించగా.. చెన్నైకు చెందిన గంజాయి విక్రేతలు కార్తీక్, సురేష్‌కు ఆర్డర్‌పై సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో పోలీసులు ఆరుగుర్నీ అరెస్ట్ చేసి రెండు కార్లను, గంజాయిని సీజ్ చేశారు. ఈ సరకు విలువ రూ.10 లక్షలు ఉంటుందని ఎస్పీ వెల్లడించారు.

నిందితులపై పలు కేసులు

పట్టుబడిన నిందితుల్లో అనంత శివప్రసాద్‌పై విశాఖపట్నం కేడీ పేట పోలీస్‌స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ యాక్ట్, రోలుగుంట, విశాఖపట్నం ద్వారకా స్టేషన్ పరిధిలో కేసులున్నాయి. కె.శ్రీనుపై రోలుగుంట స్టేషన్‌లో, ఎ.రాజేష్‌పై రోలుగుంట స్టేషన్, విశాఖపట్నం పీఎం పాలెం స్టేషన్‌లో గంజాయి కేసు ఉందని ఎస్పీ తెలిపారు.

నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు

విద్యుత్ శాఖ ఎస్ఈ మహేంద్రనాథ్


లంబసింగిలో సర్క్యూట్ బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ మహేంద్రనాథ్

నర్సీపట్నం: వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టామని విద్యుత్ శాఖ ఎస్ఈ మహేంద్రనాథ్ తెలిపారు. విద్యుత్ సరఫరా విధానంపై నర్సీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సీపట్నంలో ఇండోర్ సబ్ స్టేషన్‌కు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.70 లక్షలతో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించి మూడు రోజుల్లో పనులు ప్రారంభమవుతాయన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో పట్టణ ప్రజలకు లోవోల్టేజ్ సమస్య ఉండదన్నారు. గిరిజన గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చింతపల్లి మండలం లంబసింగిలో రూ.12 లక్షలతో నిర్మించిన సర్క్యూట్ బ్రేకర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈదురుగాలులు, వర్షాల వల్ల చెట్ల కొమ్మలు విరిగిపడటం వల్ల సరఫరాకు అంతరాయం కలగకుండా సర్క్యూట్ బ్రేకర్‌ను ఏర్పాటు చేశామన్నారు. దీని వల్ల ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే తెలుస్తుందన్నారు. వెనువెంటనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. వేసవిలో విద్యుత్ సమస్య తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి లోవోల్టేజ్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమీక్షలో ఈఈ సురేష్‌బాబు, ఏడీ సత్యానందం, విద్యుత్ ఏడీలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

నూనెగింజల అభివృద్ధికి మినీ కిట్లు

అనకాపల్లిటౌన్: జాతీయ ఆహార భద్రతా పథకం, నూనెగింజల పంటల అభివృద్ధిలో భాగంగా జిల్లాకు 200 కదిరి లేపాక్షి(కె-1812), వేరుశనగ మినీకిట్స్‌ను కేటాయించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాభివృద్ధికి కేటాయించిన ఈ కిట్లతో పాటు రైతులకు జీవ ఎరువుల్ని ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ యాప్ ద్వారా నమోదు చేసుకుని, వీటిని పొందాల్సిందిగా సూచించారు. మినీ కిట్లను పొందిన రైతులు నీటి వసతి ఉన్న పొలాల్లో నాటి ఈ-పంటలో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

మినీ కిట్లను అనకాపల్లి డివిజన్‌లో 28 మంది, చోడవరం డివిజన్‌కు 99, నర్సీపట్నం డివిజన్‌కు 14, పాయకరావుపేట డివిజన్ 32, యలమంచిలి డివిజన్‌లో 27 మంది రైతులకు అందించినట్లు వెల్లడించారు.

ల్యాండ్ పూలింగ్ సమస్య పరిష్కారానికి కృషి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు


సమావేశంలో మాట్లాడుతున్న, దాడి వీరభద్రరావు

అనకాపల్లి టౌన్: వెర్లోపల ఖండం జిరాయితీ భూముల ల్యాండ్ పూలింగ్ సమస్యను ప్రభుత్వం త్వరలో పరిష్కరిస్తుందని వ్యవసాయదారుల సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు తెలిపారు. స్థానిక వి.వి.రమణ రైతుభారతి హాలులో సోమవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. 16 ఏళ్ల క్రితం డెవలప్‌మెంట్ నిమిత్తం రైతులు 50 ఎకరాలను వుడాకు జీపీఏ రిజిస్ట్రేషన్ చేసి అప్పగించారన్నారు. ఈ భూములను స్వాధీనం చేసుకుని లేఅవుట్ అభివృద్ధి పనులకు రూ.2 కోట్లు ఖర్చు చేశారన్నారు. అనంతరం అప్పటి వుడా వైస్ చైర్మన్ కోటేశ్వరరావు ప్రాజెక్టును నిలుపుదల చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. తర్వాత వచ్చిన వైస్ చైర్మన్ రామిరెడ్డికి సమస్య వివరించగా.. రైతులకు, వుడాకు ఈ ప్రాజెక్టు లాభదాయకంగా ఉంటుందని, ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వానికి 18 నెలల కిందట లేఖ రాసినట్టు చెప్పారు. దీనిపై పట్టణాభివృద్ధి శాఖాధికారుల్లో చలనం లేకపోవడంతో టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రాజెక్టు పూర్తికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంఘ సభ్యులు విల్లూరి రాము, బుద్ధ రమణాజీ, కొణతాల భాస్కరరావు, కొణతాల రమణ అప్పారావు, కర్రి దివాకర్, బుద్ధ బాపునాయుడు, పెంటకోట సూర్యప్రకాశరావు, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, బీశెట్టి కృష్ణ అప్పారావు, కాండ్రేగుల సూరరాజు, కొణతాల పవన్, కర్రి రాము, కాండ్రేగుల జగ్గ అప్పారావు, కొణతాల శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి ఆత్మహత్య

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వైర్ రాడ్ మిల్ సీనియర్ ఫోర్‌మెన్ ఇంగువ శ్రీనివాసరావు (48) ఆత్మహత్యకు పాల్పడ్డారు. కొయ్యూరు ప్రాంతానికి చెందిన ఆయన తన కుటుంబంతో టౌన్‌షిప్‌లోని సెక్టార్-6కు చెందిన 343 ఎఫ్ క్వార్టర్‌లో నివసిస్తున్నారు. కొన్నేళ్లుగా మద్యానికి బానిసై విధులకు సరిగా వెళ్లడం లేదు. సోమవారం మధ్యాహ్నం తన రూంలోకి వెళ్లి ఎంతసేపటికీ రాకపోవడంతో లోపలికి వెళ్లి చూడగా కిటికీకి ఉరి వేసుకుని కనిపించారు. సమాచారం మేరకు సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

జూలో జిరాఫీకి అస్వస్థత

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో జిరాఫీ అస్వస్థతకు గురైంది. ఇక్కడ ఉన్న జత జిరాఫీలలో నాలుగు రోజుల క్రితం ఆడ జిరాఫీ మృతి చెందిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మగ జిరాఫీ ఒంటరిగా ఎన్‌క్లోజర్‌లో తిరుగుతూ రాత్రులు నైట్ షెల్టర్‌లో విశ్రాంతి తీసుకుంటోంది. ఒంటరిగా ఉన్న ఈ జిరాఫీ రెండు రోజులుగా అస్వస్థతకు గురైంది. దీంతో జూ అధికారులు స్పందించి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇప్పటికే ఒక జిరాఫీని కోల్పోయిన జూ అధికారులు మిగిలినదాన్ని కాపాడుకోవడానికి మరింత జాగ్రత్తలు తీసుకొంటున్నారు. జూ వైద్యుడు లాంగ్ లీవ్ పెట్టడంతో మరో వైద్యుణ్ని రప్పించి వైద్యసేవలందిస్తున్నట్టు జూ క్యూరేటర్ నందనీ సలారియా చెప్పారు. ప్రత్యామ్నాయంగా వేరే వైద్యుడిని నియామకం కోసం ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టినట్లు తెలిపారు. వైద్యుడి సంరక్షణలో ప్రస్తుతం జిరాఫీ కోలుకుంటోందన్నారు.

క్లుప్తంగా

'జగనన్నకు చెబుదాం'లో 10 అర్జీలు



అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్ : ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటూ త్వరితగతిన పరిష్కరించేందుకు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలో 10 అర్జీలు అందాయన్నారు. వీటిపై ఇరువర్గాలను పిలిపించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. భూ, ఆస్తి తగాదాలపై అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు.

'జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి'

అనకాపల్లిటౌన్ : రోజురోజుకు జర్నలిస్టులపై పెరుగుతున్న దాడులను ఖండించాలని, దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ ప్రతినిధులు స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.జోగినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా విధులు నిర్వహిస్తున్న పత్రికా విలేకరులపై జరుగుతున్న దాడుల్ని అరికట్టేలా ప్రజాప్రతినిధులు, రాజకీయనేతలు చట్టాలను రూపొందించాలని ఆయన కోరారు. అనంతరం ఆర్డీవో ఏజే చిన్నికృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

'మండే' సూర్యుడు



జనంలేక వెలవెలబోతున్న కశింకోటలోని గవరపేట వీధి

కశింకోట : కశింకోట ప్రాంతంలో సూర్యతాపంతో సోమవారం ప్రజలు విలవిలలాడారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఒకవైపు ఉష్ణోగ్రత, మరోవైపు ఉక్కపోతతో అల్లాడిపోయారు. ప్రధానంగా వృద్ధులు, పిల్లలు ఇబ్బందిపడ్డారు. ప్రజలు అత్యవసర పనులుంటే తప్ప బయటకు వెళ్లడానికి సాహసించలేదు. దీంతో ఇక్కడి పంచాయతీ ప్రధాన రహదారితోపాటు పలు వీధులు జన సంచారం లేక వెలవెలబోయాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 364 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,600	5,140
రెండో రకం	4,070	4,480
మూడోరకం	3,930	4,030

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	: రాజా
రామబాణం	: సత్యనారాయణ-1
లక్ష్మీ మంచి శకునములే	: సత్యనారాయణస్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డీసాయి
విరూపాక్ష	: పద్మసాయి
ఫాస్ట్ ఎక్స్	: వెంకటేశ్వర
ఉగ్రం	: శ్రీసత్య
బిచ్చగాడు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 77 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-22 యూనిట్లు, ఓ పాజిటివ్-50 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 415 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 259 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

సూరీడు.. భగభగలు

- ఎండలు పెరిగి, తేమ తగ్గి
- వేడి, ఉక్కబోతతో సతమతం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



ఎండలతో దాదాపు నిర్మానుష్యంగా ఉన్న అనకాపల్లి నెహ్రూ చౌక్ కూడలి (ఇన్‌సెట్) ఎండ తీవ్రతకు రక్షణగా తలకు టవల్, చీర కప్పుకున్న వృద్ధ దంపతులు

అనకాపల్లి రూరల్ : సాధారణంగా రోహిణీ కార్తెలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఈసారి ముందుగానే భరించలేనంత వేడి వాతావరణంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు అనకాపల్లి ప్రాంతవాసులను తారెత్తిస్తున్న మార్తాండుడు.. సోమవారం మరింత ఉగ్రరూపమెత్తాడు. దీనికి తోడు వాతావరణంలో తేమ శాతం బాగా తగ్గిపోయింది. ఫలితంగా జనం ఉక్కబోతతో ఆపసోపాలు పడుతున్నారు.

రోహిణీకి ముందే మండే ఎండలు

సోమవారం అనకాపల్లి పట్టణంలో 38.7 డిగ్రీల గరిష్ట, 24.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తేమ శాతం 45గా ఉండడంతో జనం ఉక్కబోతకు గురయ్యారు. సాధారణ రోజుల్లో గాలిలో తేమ శాతం 60-80 వరకు ఉంటుంది. ఇపుడు ఉష్ణోగ్రతలతో పాటుగా తేమ శాతం తగ్గిపోతుండటంతో జనానికి ఇబ్బందులు తప్పట్లేదు. ఈ నెల 11న పెద్ద కత్తెర ప్రారంభమైనప్పటి నుంచి ఉష్ణోగ్రతల్లో గణనీయంగా పెరుగుదల నమోదవుతోంది. 25న రోహిణీ కార్తె ప్రారంభం కానుంది. ఇప్పుడే ఇలా ఉంటే.. రోహిణీ కార్తెలో ఇంకెంత దారుణంగా ఉంటుందోనని ప్రజలు హడలెత్తిపోతున్నారు. అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు వచ్చే సాహసం చేయలేకపోతున్నారు. మధ్యాహ్నం పూట చాలా వరకు పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

అన్ని రంగాలపై ప్రభావం

ఎండలు ఎక్కువగా ఉండటంతో ఆ ప్రభావం అన్ని రంగాలపై పడుతోంది. చిరు వ్యాపారులతో పాటు వ్యవసాయపనులపై ఆధారపడేవారు, రెక్కాడితే గాని డొక్కాడని భవన నిర్మాణ కూలీలపై భానుడి ప్రతాపం భారీగా చూపుతోంది. ఉపాధిని దూరం చేస్తోంది. పట్టణంలో తోపుడు బండ్లు, వీధి వ్యాపారులు చేసుకునేవారు తమ ఉపాధి దెబ్బతింటోందని వాపోతున్నారు. గిరాకీ ఉన్నప్పటికీ ఉదయం 11 గంటలలోపే పని పూర్తి చేసుకుని ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఇక రోడ్ల పక్కన వ్యాపారం చేసే వారు ఎండల తీవ్రతతో బెంబేలెత్తిపోతున్నారు. బతుకుతెరువు కోసం తప్పనిసరై రోడ్డు మీదకు వస్తున్నా ఎండ తీవ్రత పెరగకముందే అమ్మకాలు పూర్తి చేసుకుని వెళ్లిపోతున్నారు. వడగాడ్పులతో బేరాలు తగ్గిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. ఎండలకు భయపడి మధ్యాహ్నం సమయాల్లో దుకాణాలు మూసివేసి తిరిగి సాయంత్రం తెరుస్తున్నామని పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులు తెలిపారు.

పెరిగిన విద్యుత్తు వినియోగం

ఇంట్లో ఫ్యాన్లు తిరుగుతున్నా చెమటతో దుస్తులు తడిసిపోతున్నాయి. చల్లదనంకోసం ఏసీలను ఆశ్రయించేవారి సంఖ్య పెరుగుతోంది. గత 10 రోజుల్లో విద్యుత్ వినియోగం 12 నుంచి 15 శాతం పెరిగిందని విద్యుత్తు శాఖ అధికారులు చెబుతున్నారు. ఓవర్ లోడ్ సమస్యతో రోజులో పలుమార్లు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఒకవైపు అధిక ఎండలు, వడగాడ్పులు, అదేసమయంలో అధికలోడ్‌తో విద్యుత్తు నియంత్రికలు మరమ్మతుకు గురవుతున్నాయి. దీంతో విద్యుత్తు సిబ్బందికి రాత్రంతా బిజీయే.

జాగ్రత్తలు తప్పనిసరి



అధిక ఉష్ణోగ్రతలతో వడదెబ్బకు గురవడం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి అలసట, ఆయాసం వస్తే తగు జాగ్రత్త వహించాలి. ఎక్కువగా మజ్జిగ, నీళ్లు తీసుకోవాలి. శరీరాన్ని అన్నివేళలా తేమగా ఉంచే చిరుధాన్యాలు ఆహారంగా తీసుకుంటే మంచిది. ఎండలో ఎక్కువగా తిరగరాదు. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. సాధ్యమైనంతవరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి. చల్లని నీడన ఉండాలి.

– ఎస్.వాణీ జగదీశ్వరి, వైద్యురాలు, తుమ్మపాల పీహెచ్‌సీ

సచివాలయాల్లోనే 'రీసర్వే' భూముల రిజిస్ట్రేషన్లు

- జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఏఎస్ఎన్ మూర్తి



అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సచివాలయాల్లోనే అన్ని రకాల రిజిస్ట్రేషన్లు చేయించుకోవచ్చని స్థానిక జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఏఎస్ఎన్ మూర్తి తెలిపారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడారు. అనకాపల్లిలోని వెంకుపాలెం, కశింకోట మండలంలో అడ్డాం, ఏఎస్ పేట, కశింకోట, సుందరయ్యపేట, కొత్తపల్లి, తాళ్లపాలెం, తేగాడ, గొబ్బూరు, పేరంటాలపాలెం, వెదురుపర్తి, జెట్టపురెడ్డి తుని, అచ్చెర్ల, చెరకాం, చింతలపాలెం, ఈ చోడువాడ, జి.భీమవరం, నరసింగబిల్లి, శింగవరం, మునగపాక మండలంలో అరబుపాలెం, జీపీ అగ్రహారం, రాజుపేట అగ్రహారం, రామభద్రపురం, మడకపాలెం, మల్లవరం, ఉమ్మలాడ, వాడ్రాపల్లి, ఒంపోలు, తిమ్మరాజుపేట సచివాలయాల పరిధిలోని ప్రజలు తమ భూముల రిజిస్ట్రేషన్లకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వరకు వెళ్లాల్సిన పనిలేదన్నారు. వీరంతా తమ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవచ్చన్నారు. వివరాలకు గ్రామ సచివాలయ కార్యదర్శులను సంప్రదించాలని సూచించారు.

25న ఏఐఆర్ఎల్ఏ రాష్ట్ర మహాసభ



మహాసభలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా కార్యదర్శి గణేష్

అనకాపల్లిటౌన్ : అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం(ఏఐఆర్ఎల్ఏ) 5వ రాష్ట్ర మహాసభ ఈ నెల 25న స్థానిక బారువారివీధి దాటికొండ నూకయ్యశెట్టి మెమోరియల్ హాల్లో నిర్వహించనున్నట్లు కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.గణేష్ తెలిపారు. మహాసభలను పురస్కరించుకుని స్థానిక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా దేశమంతా ఏకమై పోరాడాలని సూచించారు. గ్రామీణ వ్యవసాయ కార్మిక కుటుంబాలకు 'సాగుకు భూమి-ఉపాధికి హామీ' వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వ్యవసాయ కార్మిక కుటుంబాలకు ఏడాదిలో 200 రోజుల పని, రోజుకు రూ.500లు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంతాల చట్టాలను అమలుచేసి, నాన్ షెడ్యూల్డ్ ఆదివాసీ గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతాలుగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మానుకొండలచ్చబాబు, సభ్యులు పాల్గొన్నారు.

కంపోస్టు యార్డును తొలగించాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వీరుయాదవ్

సీతమ్మధార(విశాఖ): అనకాపల్లి పట్టణం నడిబొడ్డున ఉన్న కంపోస్టు యార్డును తరలించాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లికి చెందిన విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ విశాఖలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనకాపల్లిలో జీవీఎంసీ కార్యాలయానికి ఆనుకుని ఉన్న ఉడ్‌పేటలో దుర్లభమైన జీవనం సాగిస్తున్నామన్నారు. ఎక్కడో ఊరి చివర ఉండాల్సిన కంపోస్టు యార్డ్ ఊరి మధ్యలో, జనావాసాల నడుమ ఉండడంతో నానా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కంపోస్టు యార్డు సమీపంలో కళాశాలలు, స్కూళ్లు ఉన్నాయని, యార్డు వల్ల పాఠశాలల పిల్లలు మధ్యాహ్నం భోజనం చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఎక్కడెక్కడి నుంచో వ్యర్థాలు, చనిపోయిన ఎలుకలు, పిల్లులు, కుక్కలను తీసుకొచ్చి యార్డ్‌లో వేస్తున్నారని ఆక్షేపించారు. కుళ్లిన చెత్త, దుర్వాసనతో ఉండలేకపోతున్నామని వాపోయారు. తక్షణం కంపోస్టు యార్డును తొలగించి తమ ఆరోగ్యాలను, ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు.

ఆసరా మూడో విడత లబ్ధిపై ఆరా



వైఎస్సార్ ఆసరా డిజిటల్ ఎకనాలెడ్జ్‌మెంట్లను సేకరిస్తున్న వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు

కశింకోట : స్వయం సహాయక సంఘాల సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకం కింద చెల్లించిన రుణ మాఫీ నగదు లబ్ధిదారులకు చేరిందా? లేదా? అనే విషయమై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఈ మేరకు లబ్ధిదారుల నుంచి డిజిటల్ ఎకనాలెడ్జ్‌మెంట్ల సేకరణ చేపట్టింది. దీనిలో భాగంగా స్వయం సహాయక సంఘాలతో క్లస్టర్ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా సోమవారం స్థానిక కనకమహాలక్ష్మి వీధిలోని రామాలయంలో స్వయం సహాయక సంఘాలతో సమావేశం నిర్వహించారు. వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు అర్హులైన సభ్యులను అడిగి, డిజిటల్ ఎకనాలెడ్జ్‌మెంట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మూడో విడతగా వైఎస్సార్ ఆసరా పథకం కింద 1587 గ్రూపుల్లోని 15,805 మంది సభ్యులకు రుణ మాఫీ నగదు రూ.13.50 కోట్లు మేర బ్యాంకు ఖాతాల్లో జమ అయిందన్నారు. సేకరించిన ఎకనాలెడ్జ్‌మెంట్ ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి చేరుతుందన్నారు. సంఘాల్లో లేని సభ్యులను కొత్త సంఘాల్లో చేర్పడానికి, పూర్వ సంఘాల్లో సర్దుబాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీసీ సత్యనారాయణ, వీవోఏ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

'విసన్నపేట భూములపై జ్యుడీషియల్ కమిటీ వేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న దూలం గోపి

అనకాపల్లిటౌన్ : కశింకోట మండలం విసన్నపేట ప్రభుత్వ భూములపై జ్యుడీషియల్ కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దూలం గోపి కోరారు. స్థానిక బారువారివీధి పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విసన్నపేట భూమిలో సర్వే నెం.195, 198లో ప్రభుత్వ భూమిని కొంతమంది నేతలు స్వాధీనపరచుకుని ప్లాట్లుగా మార్చి అమ్మకాలు సాగించినట్లు తెలిపారు. ఈ విషయమై లోకాయక్త ఈ ఏడాది జనవరి 20న కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం గడువు కోరగా ఈ కేసును జూలై 20కు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు తాడి రామకృష్ణ, మళ్ల శ్రీను, రాముయాదవ్ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు ప్రశంసనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్వో వెంకటరమణ, శ్రీరామ్మూర్తి

అనకాపల్లిటౌన్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూచౌక్ కూడలిలో సోమవారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని డీఆర్వో డి.వెంకటరమణ, ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ శ్రీరామ్మూర్తిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు ప్రశంసనీయమన్నారు. వాతావరణం చల్లబడే వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సొసైటీ ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రాఘవరెడ్డి, ఆడారి రాజశేఖర్, ఉగ్గిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వియ్యపు రాజు

అనకాపల్లి రూరల్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కోడుగంటి గోవిందరావు భవన్‌లో జరిగిన అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ నిర్వీర్యం చేస్తోందన్నారు. రాష్ట్రంలో మెగా డీఎస్సీ ద్వారా ఖాళీగా వున్న 50వేల టీచర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు, రాధాకృష్ణ, బాలరాజు, భరత్, రాంబాబు, గణేష్, చైతన్య శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

చెరకాంలో 'గడప గడపకు' రేపు

కశింకోట : మండలంలోని చెరకాం గ్రామంలో ఈ నెల 24న ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరపనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఈ కార్యక్రమంలో పాల్గొని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తారన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారన్నారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

ఉపాధి కూలీల నిరసన



తేగాడ సచివాలయం వద్ద ఉపాధి కూలీల నిరసన

కశింకోట : మండలంలోని తేగాడ సచివాలయం వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు నిరసన తెలిపారు. తమకు రోజు కూలీ రూ.600 చెల్లించి, 200 రోజులు పని దినాలు కల్పించాలని, పనిముట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఉపాధి కూలీల ప్రతినిధులు కె.వెంకటలక్ష్మి, వై.అప్పలనరస తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతక స్వామికి ప్రత్యేక పూజలు



త్రిపురాంతకస్వామి ఆలయంలో పూలతో శివలింగానికి అలంకరణ

కశింకోట : స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివలింగాన్ని పూలతో అందంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వి.శంకరం, వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భక్తుల సహకారంతో అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణపై అసంతృప్తి



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లి రూరల్ : అంగన్‌వాడీ కేంద్రంలో మెనూ అమల్లో నిర్లక్ష్యంపై అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని సంపతిపురం సచివాలయ పరిధి టి.వెంకుపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూను తమ ఇష్టం వచ్చినట్లుగా మార్పులు చేయడంపై మండిపడ్డారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రికార్డులను తనిఖీచేసి, నిర్వహణ పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలని స్పష్టం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో కె.ధర్మారావు, ఏసీడీపీవో శశికళ, ఏఈ కుమార్‌రాజా, సంపతిపురం వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు పల్లా శ్రీనివాసరావు, భర్నికాన రాము, పోతల శేఖర్, గోకివాడ నాగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ఇద్దరికి అవకాశం

పరవాడ: మండలంలో భర్నికం శివారు బాపడుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు నబ్బవరం, తాళ్లపాలెం గురుకుల పాఠశాలల కు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.రాజశ్రీ చెప్పారు. పాఠశాలకు చెందిన కట్టా లాస్యశ్రీ, సమ్మెంగ గుణశ్రీలు ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చి నబ్బవరం, తాళ్లపాలెం ప్రాంతాల్లోని గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించారని తెలిపారు. ఉపాధ్యాయుడు కొరుపోలు గంగాధర్ విద్యార్థులను ప్రోత్సహించారని చెప్పారు. గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించిన విద్యార్థులను సోమవారం పాఠశాల హెచ్‌ఎం రాజశ్రీ, ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులో మరింతగా రాణించాలని స్ఫూర్తి నింపారు. తమ పిల్లలకు గురుకుల పాఠశాలల్లో సీట్లు రావడంతో తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

గోడపత్రిక ఆవిష్కరణ



ఈనెల 26, 27 తేదీల్లో మునగపాక మండలం వాడ్రాపల్లి గ్రామంలో శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి తోడపెద్దు పాలుకొలుపు మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవానికి సంబంధించిన గోడపత్రికను ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి సోమవారం ఆవిష్కరించారు.

–అనకాపల్లి టౌన్

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ధ్యాన కేంద్ర వార్షికోత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న రత్నాకర్

మునగపాక : ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. నాగులాపల్లి చంద్రశేఖర్ పిరమిడ్ ధ్యాన కేంద్రం 5వ వార్షికోత్సవాలను ఆయన సోమవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పిల్లల నుంచి పెద్దల వరకు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. తద్వారా అనారోగ్యాల బారిన పడాల్సి వస్తుందన్నారు. ఇటువంటి తరుణంలో ధ్యానం చేయడం మంచిదన్నారు. మనస్సు ప్రశాంతంగా ఉంటే ఉద్యోగ,వ్యాపారాల్లోనే కాకుండా నిజ జీవితంలో అభివృద్ధి సాధించవచ్చన్నారు. అలాగే విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ ప్రతి రోజు క్రమం తప్పకుండా వ్యాయామం, ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకులు సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అనకాపల్లి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ త్రినాథ్, షిరిడీ సాయి లా కళాశాల కరస్పాండెంట్ పెంటకోట వెంకటరావు,భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు రాజా రామ్మోహన్‌రాయ్



నివాళులర్పిస్తున్న శివశంకర్, ప్రతినిధులు

అనకాపల్లిటౌన్ : భారతదేశంలో సాంఘిక దురాచారాలపై అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు రాజా రామ్మోహన్ రాయ్ అని బ్రైట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కాళ్ల శివశంకర్ అన్నారు. పట్టణంలోని గాంధీనగరం సంస్థ కార్యాలయంలో రాజా రామ్మోహన్‌రాయ్ 251వ జయంతి వేడుకలు సోమ వారం ఘనంగా నిర్వహించారు. రామ్మోహన్‌రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంస్థ కార్యదర్శి తాతపూడి జయశ్రీ పాల్గొన్నారు.

నీతి కథలతో విజ్ఞానం



వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

నబ్బవరం: నీతి కథలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని వృద్ధి చేసుకోవచ్చునని నబ్బవరం శాఖా గ్రంథాలయాధికారి శిరీష అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం పేపర్ రీడింగ్, నీతి కథలు చదవడం,చెప్పడం నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శిబిరం ముగింపు రోజున ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి శిరీష తెలిపారు. కార్యక్రమంలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.